చేర్యాల రోడ్ షోకు తరలివచ్చిన ప్రజలు. ఇన్‌సెట్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

‘చామల’ ఓ కబ్జాకోరు

- బీఆర్ఎస్ పార్టీ భువనగిరి ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశం
- హామీలతో మోసం చేసిన కాంగ్రెస్
- చేర్యాల రోడ్‌షోలో ఎమ్మెల్యే పల్లా

చేర్యాల, మే 9: రాహుల్‌గాంధీ సంతకాన్ని ఫోర్జరీ చేయడమే కాకుండా ఆదిబట్లలో ప్లాట్లు ఆక్రమించిన కాంగ్రెస్ భువనగిరి ఎంపీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ఓ కబ్జాకోరు అని బీఆర్ఎస్ భువనగిరి ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశం ఆరోపించారు. జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం రాత్రి చేర్యాల పట్టణంలో భారీ రోడ్ షో జరిగింది. ఈ సందర్భంగా క్యామ మాట్లాడుతూ.. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ పదేండ్ల పాటు ప్రజలకు సుపరిపాలన అందించారని, కాంగ్రెస్ సర్కారు వచ్చిన 5 నెలల్లోనే రాష్ట్రం ఆగమైందని చెప్పారు. కేసీఆర్ ఎంపీ టికెట్ల కేటాయింపులో బీసీలకు అధిక ప్రాధాన్యం ఇచ్చారని తెలిపారు. అత్యధిక జనాభా ఉన్న గౌడ, మాదిగ, గొల్ల కురుమలకు కాంగ్రెస్ పార్టీ ఒక్క టికెట్ ఇవ్వలేదని, పార్టీ మారిన దొంగలకు టికెట్లు ఇచ్చిందని విమర్శించారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని కేసీఆర్ అడిగితే.. సీఎం రేవంత్ రెడ్డి తిట్ల దండకం అందుకున్నారని, బీఆర్ఎస్ నాయకులు తిట్టడం ప్రారంభిస్తే.. సీఎం బట్టలు ఊడిపోతాయని హెచ్చరించారు. కేసీఆర్ యాదాద్రిని నిర్మించి ఏనాడూ రాజకీయాల కోసం నర్సింహస్వామిని వాడుకోలేదని గుర్తుచేశారు. భువనగిరి ఎంపీలుగా పనిచేసిన కోమటిరెడ్డి బ్రదర్స్, బూరనర్సయ్య ఈ ప్రాంతానికి చేసిన అభివృద్ధి శూన్యమని, సామాన్య కుటుంబానికి చెందిన తనను ఆదరిస్తే ఎమ్మెల్యే పల్లాతో కలిసి ఈ ప్రాంత సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. అడ్డగోలు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. రాష్ట్రంలోని ప్రజలను మోసం చేసిందని విమర్శించారు.

రాహుల్.. రాంగ్ గాంధీ!

- హామీలు అమలు చేయకున్నా చేస్తున్నట్టు చెప్తుండు
- ప్రజలకు రాహుల్ క్షమాపణలు చెప్పాలి
- మహిళలకు 2,500 ఇవ్వని కాంగ్రెస్..8,500 ఇస్తదా?
- ఉదయ్‌పూర్ డిక్లరేషన్ ఏమైంది?
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి క్యాబినెట్‌లో ఒక్క ముస్లింకూ స్థానం లేదు
- బీజేపీతో పోరాడేది బీఆర్ఎస్ మాత్రమే: మాజీ మంత్రి హరీశ్‌రావు



జహీరాబాద్‌లో రోడ్‌షోలో మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు. చిత్రంలో జహీరాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి అనిల్‌కుమార్, జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు, నేతలు శివకుమార్, నరోత్తం

సిద్దిపేట/సంగారెడ్డి, మే 9 (నమస్తే తెలంగాణ): ఎన్నికల ప్రచారంలో అబద్ధాలు మాట్లాడుతూ రాహుల్‌గాంధీ.. రాంగ్ గాంధీగా మారారని మాజీ మంత్రి హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కారు ఒక్క హామీ నెరవేర్చకున్నా అన్ని హామీలు నెరవేర్చామని రాహుల్‌గాంధీ అబద్ధాలు చెప్పటం ప్రజలను మోసగించటమేనని మండిపడ్డారు. అబద్ధాలు ఆడుతున్న రాహుల్‌గాంధీ తెలంగాణ ప్రజలు, అక్కాచెల్లెల్లకు వెంటనే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. గురువారం జహీరాబాద్, సంగారెడ్డి, తెల్లాపూర్‌లో రోడ్‌షోల్లో, సిద్దిపేటలోని ముస్లిం మైనార్టీల సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. రాహుల్‌గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి తీరును దుయ్యబట్టారు. అధికారం కోసం రాహుల్‌గాంధీ.. రేవంత్‌రెడ్డి కంటే ఎక్కువ అబద్ధాలు ఆడుతున్నారని విమర్శించారు. ఐదు గ్యారెంటీలు అమలు చేశామని కాంగ్రెస్ చెప్తుంటే.. రాహుల్ మాత్రం అన్ని హామీలు అమలు చేశామని చెప్పడం విడ్డూరంగా ఉన్నదని తెలిపారు. మహిళల ఖాతాల్లో రూ.2,500 జమ చేస్తామని, తనది జిమ్మేదారని అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో చెప్పిన రాహుల్.. ఆ హామీని నెరవేర్చామని అబద్ధం చెప్తున్నారని మండిపడ్డారు. మహిళల ఖాతాల్లో రూ.2,500 జమ చేయలేదు కానీ కేంద్రంలో అధికారం ఇస్తే రూ.8,500 జమచేస్తానన్నటం హాస్యాస్పదంగా ఉన్నదని వ్యాఖ్యానించారు. రాహుల్ గాంధీ ఎన్నిమాటలు చెప్పినా తెలంగాణ జనం నమ్మరని.. అందుకే జనంలేక ఆయన సభలు వెలవెలబోతున్నాయని ఎద్దేవా చేశారు. సరూర్‌నగర్ మీటింగ్‌కు 20 వేల కుర్చీలు వస్తే 5 వేల కుర్చీలు కూడా నిండలేదని వెల్లడించారు. ప్యారాచూట్ నేతలకు టికెట్లు ఇవ్వబోమని ఉదయ్‌పూర్ డిక్లరేషన్ చేసిన కాంగ్రెస్.. ఈ లోక్‌సభ ఎన్నికల్లో మెదక్, సికింద్రాబాద్, మల్కాజిగిరి, చేవెళ్లలో ప్యారాచూట్ నేతలకే ఎంపీ టికెట్లు ఇచ్చిందని గుర్తుచేశారు. రాహుల్‌గాంధీ ఉదయ్‌పూర్ డిక్లరేషన్ ఏమైంది? కాకి ఎత్తుకెళ్లిందా? అని ప్రశ్నించారు. ఎమ్మెల్యేలు పార్టీమారితే డిస్‌క్వాలిఫై చేస్తామని చెప్తే.. అందుకు విరుద్ధంగా సీఎం రేవంత్‌రెడ్డి దానం నాగేందర్‌ను సభల్లో తనపక్కనే కూర్చోబెట్టుకుంటున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి స్థానికేతరుడు అంటున్న రేవంత్.. తన సొంత నియోజకవర్గంలో కాకుండా కొడంగల్, మల్కాజిగిరిలో ఎందుకు పోటీ చేశారని నిలదీశారు. దుబ్బాకలో చెల్లని రఘునందన్‌రావు మెదక్ పార్లమెంట్‌లో చెల్లుతారా? అని ప్రశ్నించారు. బీజేపీతో పోరాడేది బీఆర్ఎస్ మాత్రమేనని, కాంగ్రెస్‌కు ఓటు వేస్తే బీజేపీకే లాభం చేకూరుతుందని తెలిపారు. తాము బీజేపీతో కలిసి ఉంటే కవిత అరెస్టు అయ్యేవారా? అని ప్రశ్నించారు. కేసీఆర్ పదేండ్ల పాలనలో కర్ఫ్యూలు, అల్లర్లు లేవని, ప్రజలంతా కలిసిమెలిసి జీవించారని గుర్తుచేశారు. కేసీఆర్ సెక్యులర్ లీడర్ అని, అన్నివర్గాల అభివృద్ధి కోసం పనిచేశారని వెల్లడించారు. రేవంత్‌రెడ్డి 12 మంది మంత్రుల్లో ఒక్క ముస్లిం మైనార్టీకి స్థానం కల్పించలేదని తెలిపారు. జహీరాబాద్, మెదక్ స్థానాల్లో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థులు గాలి అనిల్‌కుమార్, వెంకట్రామిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. కార్యక్రమాల్లో పార్టీ ఎంపీ అభ్యర్థులు వెంకట్రామిరెడ్డి, గాలి అనిల్‌కుమార్, ఎమ్మెల్యేలు చింతా ప్రభాకర్, మహిపాల్‌రెడ్డి, మాణిక్‌రావు, మాజీ ఎమ్మెల్సీ ఫరూక్ హుస్సేన్, పార్టీ రాష్ట్ర నాయకులు దేవీప్రసాద్‌రావు, శివకుమార్, బుచ్చిరెడ్డి, మైనార్టీ సెల్ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు ఫక్రుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

లోకం పోకడ



మీ పార్టీలకు ఎదురుగాలి వీస్తుందో, లేదో ఇక్కడ చెప్పడం కుదరదంటే వినరేమయ్యా!

ఎండా కాలం

	గరిష్ఠం	కనిష్ఠం
మహబూబ్‌నగర్	41.2°c	29.5°c
నిజామాబాద్	41.1°c	27.5°c
నల్లగొండ	41.1°c	27.3°c
మెదక్	40.9°c	21.8°c
రంగారెడ్డి	40.2°c	23.0°c
ఆదిలాబాద్	40.0°c	25.5°c
ఖమ్మం	38.0°c	29.0°c
కరీంనగర్	38.0°c	28.0°c
వరంగల్	37.0°c	27.0°c
హైదరాబాద్	37.0°c	26.6°c

తెలంగాణ భవిష్యత్తును కాపాడేది బీఆర్ఎస్సే

- కేసీఆర్‌తోనే కృష్ణా, గోదావరి పరిరక్షణ
- రేవంత్‌కు లబ్ధి చేసేలా మోదీ విధానాలు
- 'మీట్ ది ప్రెస్'లో మాజీ మంత్రి జగదీశ్

హైదరాబాద్, మే 9 (నమస్తే తెలంగాణ): కొట్లాడి సాధించుకున్న తెలంగాణ బిడ్డల భవితవ్యం కోసం పోరాడేది బీఆర్ఎస్ ఒక్కటేనని మాజీ మంత్రి, సూర్యాపేట బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి స్పష్టం చేశారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో గురువారం నిర్వహించిన 'మీట్ ది ప్రెస్' లో ఆయన మాట్లాడారు. లోకసభ ఎన్నికలు రాష్ట్ర ప్రజలకు జీవన్మరణ సమస్య అన్నారు. కేసీఆర్ బస్సు యాత్రతో కాంగ్రెస్, బీజేపీకి భయం పట్టుకుందన్నారు. కృష్ణా, గోదావరి జలాల పరిరక్షణ బీఆర్ఎస్‌తోనే సాధ్యమని చెప్పారు.

డబుల్-ఆర్ ట్యాక్స్‌పై విచారణ ఏది?

అసెంబ్లీ ఎన్నికల్లో రేవంత్‌కు లబ్ధిచేకూరేలా మోదీ నిర్ణయాలు తీసుకున్నారని, ఎంపీ ఎన్నికల్లో మోదీకి లబ్ధి చేకూరేలా రేవంత్ చర్యలు ఉన్నాయని తెలిపారు. కాళేశ్వరం వైపు కన్నెత్తి చూడని కేంద్ర నిపుణుల కమిటీ ఢిల్లీలో రూపొందించిన నివేదికను బయటపెట్టడమే ఇందుకు తార్కాణమన్నారు. ఆర్ఆర్ ట్యాక్స్ అంటూ సీఎం రేవంత్‌పై ఆరోపణలు గుప్పిస్తున్న ప్రధాని ఆ దిశగా ఎందుకు విచారణ జరిపించడంలేదని ప్రశ్నించారు.

కోమటిరెడ్డివి చెత్తమాటలు..

తనపై కోమటిరెడ్డి చేసిన ఆరోపణలు చెత్తమాట లని జగదీశ్‌రెడ్డి కొట్టిపారేశారు. సీఎం రేవంత్‌రెడ్డి, మరో మంత్రి ఉత్తమ్‌పై మంత్రి కోమటిరెడ్డి చేసిన వ్యాఖ్యలను ఉటంకిస్తూ.. ప్రజాస్వామ్యంలో అటువంటి చీడ పురుగులు ఉండటం దురదృష్టకరమన్నారు. తనపై చేసిన వ్యాఖ్యలకు కోమటిరెడ్డి మూల్యం చెల్లించుకోవలసి వస్తుందని జగదీశ్‌రెడ్డి హెచ్చరించారు.

జీవన్‌రెడ్డి మాల్ సీజ్‌కు రంగం సిద్ధం

- బస్టాండ్ వద్ద మైక్‌లో అనౌన్స్ చేసిన ఆర్టీసీ అధికారులు

ఆర్మూర్‌టౌన్, మే 9: నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌లోని మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి మాల్‌ను సీజ్ చేసేందుకు అధికారులు రంగం సిద్ధం చేశారు. బస్టాండ్ సమీపంలోని ఆర్టీసీ స్థలాన్ని లీజుకు తీసుకున్న జీవన్‌రెడ్డి కుటుంబ సభ్యులు, మరికొందరు కలిసి విశ్వజిత్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రైవేట్ లిమిటెడ్ పేరిట షాపింగ్ మాల్ నిర్మించారు. ఈ మాల్‌కు సంబంధించి రూ.3.14 కోట్ల బకాయిలు ఆర్టీసీకి చెల్లించాల్సి ఉంది. బకాయిలు చెల్లించాలని మూడు నెలల క్రితం అధికారులు జీవన్‌రెడ్డికి నోటీసులు జారీచేశారు. నోటీసులకు స్పందించకపోతే మాల్‌ను సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఈ నేపథ్యంలో మాల్ నిర్వాహకులు కోర్టును ఆశ్రయించగా.. బకాయిల చెల్లింపునకు నెల రోజుల గడువునిచ్చింది. ఇప్పుడు కోర్టు ఇచ్చిన గడువు ముగిసిపోవడంతో ఆర్టీసీ ఉన్నతాధికారులు, పోలీసులు గురువారం జీవన్‌రెడ్డి మాల్‌కు వచ్చారు. కోర్టు ఇచ్చిన గడువు ముగిసిపోయిందని, ఈ రాత్రి 8 గంటల్లోపు బకాయిలు చెల్లించకపోతే మాల్‌ను సీజ్ చేస్తామని మైక్‌లో అనౌన్స్ చేశారు. గడువులోపు డబ్బులు కట్టకపోతే మాల్‌ను సీజ్ చేస్తామన్న అధికారులు అర్ధరాత్రి వరకు అటువైపు రాలేదు.

ముగిసిన ఎమ్మెల్సీ నామినేషన్ల స్వీకరణ

- 69 మంది అభ్యర్థులు 117 సెట్ల పత్రాల దాఖలు
- నేడు పరిశీలన, 13 వరకు ఉపసంహరణ

నల్లగొండ ప్రతినిధి, మే 9 (నమస్తే తెలంగాణ): నల్లగొండ-వరంగల్-ఖమ్మం పట్టభద్రుల శాసనమండలి ఉప ఎన్నిక నామినేషన్ల ప్రక్రియ గురువారం ముగిసింది. మూడు జిల్లాల పరిధిలో ప్రధాన పార్టీలతోపాటు వివిధ పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులు మొత్తం 69 మంది 117 సెట్ల నామినేషన్లను దాఖలు చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్ గత నెలలో విడుదల కాగా.. ఈ నెల 2 నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రారంభమైంది. సెలవు రోజు మినహాయించి ఏడు రోజులపాటు జిల్లా రిటర్నింగ్ అధికారి దాసరి హరిచందన నామినేషన్లను స్వీకరించారు. శుక్రవారం నామినేషన్లను పరిశీలించి అభ్యర్థుల జాబితాను ప్రకటించనున్నారు. ఈ నెల 13 వరకు నామినేషన్ల ఉప సంహరణకు అవకాశం ఉన్నది. ఉపసంహరణ అనంతరం బరిలో నిలిచిన అభ్యర్థుల జాబితాను విడుదల చేయనున్నారు. సుమారు 12 రోజులపాటు ప్రచారం నిర్వహించి 14వ రోజైన మే 27న పోలింగ్ నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం తగిన ఏర్పాట్లు చేయనున్నది. బీఆర్ఎస్ నుంచి ఎనుముల రాకేశ్‌రెడ్డి, కాంగ్రెస్ నుంచి తీన్మార్ మల్లన్న (చింతపండు నవీన్‌కుమార్), బీజేపీ నుంచి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి నామినేషన్లు వేశారు. వీరు కాకుండా ఇతర పార్టీలతోపాటు స్వతంత్రులుగా పలువురు నామినేషన్లు దాఖలు చేశారు.

ఐదు స్థానాల్లో మోదీ - రేవంత్ మిలాఖత్

విశ్వేశ్వర్‌రెడ్డి మంచోడనే రేవంత్ కితాబుకు ఇదే కారణం

- సీఎం ఒట్లకు దేవుడే పారిపోతున్నడు!
- ఐదు నెలల్లోనే ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిన ముఖ్యమంత్రి
- కేసీఆర్ కష్టాల్లో ఉంటే నవ్వుతూ కాంగ్రెస్‌లోకి రంజిత్‌రెడ్డి
- చేవెళ్ల పార్లమెంటులో బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని విజయం ఖాయం
- రాష్ట్రవ్యాప్తంగానూ అత్యధిక స్థానాల్లో గులాబీ పార్టీదే గెలుపు
- 'నమస్తే తెలంగాణ'తో మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

హైదరాబాద్ సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, మే 9 (నమస్తే తెలంగాణ)/బడంగ్‌పేట: సీఎం రేవంత్‌రెడ్డి ఐదు నెలల్లోనే ప్రజల విశ్వాసాన్ని కోల్పోయారని, అందుకే రుణమాఫీపై కనిపించిన దేవుడి మీద ఒట్టు పెడుతున్నారని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పీ సబితాఇంద్రారెడ్డి అన్నారు. సీఎం వస్తుండంటే గుడిలోని దేవుడు కూడా భయపడుతున్నాడని, రేవంత్ ఎక్కడ ప్రమాణం చేస్తాడోనని గుడి నుంచే పారిపోయే పరిస్థితి ఏర్పడిందని ఎద్దేవా చేశారు. హామీలను నెరవేర్చాలంటే నాయకుడికి చిత్తశుద్ధి ఉండాలని, పాలన గాలికొదిలేసి దేవుడి మీద ఒట్లు.. కేసీఆర్ మీద తిట్లతో కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. చేవెళ్లలో బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ తరపున విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్న ఆమె 'నమస్తే తెలంగాణ'తో ప్రత్యేకంగా మాట్లాడారు. హస్తిన టూర్లలో ఐదు లోక్‌సభ స్థానాల్లో బీజేపీని గెలిపించేందుకు ప్రధాని మోదీతో సీఎం రేవంత్‌కు ఒప్పందం కుదిరిందని ఆరోపించారు. బడేభాయ్-చోటేభాయ్ వ్యాఖ్యలతో పాటు చేవెళ్ల బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని కాంగ్రెస్ సీఎం రేవంత్ 'మంచోడు' అని కొనియాడడం అందులో భాగమేనన్నారు. మల్కాజిగిరికి సునీతా మహేందర్‌రెడ్డిని పంపించడం కూడా ఈ ఒప్పందంలోని వ్యూహమని చెప్పారు. ఇంకా వివరాలు ఆమె మాటల్లోనే...

రేవంత్ కుమ్మక్కు మాపై నిందలు...

సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీ టూర్‌కు వెళ్లిన సందర్భాల్లోనే ప్రధాని మోదీతో ఐదు లోక్‌సభ స్థానాలపై చీకటి ఒప్పందం జరిగిందనేది మాకు పక్కా సమాచారం. కాంగ్రెస్ సీఎం అయి ఉండి కూడా చేవెళ్ల సభలో బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి చాలా మంచోడు అని పొగిడారు. కాంగ్రెస్ కార్యకర్తలు బీజేపీకి సహకరించాలనే స్పష్టమైన సంకేతాన్ని సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చారు. మల్కాజిగిరిలోనూ బీజేపీకి సహకరించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ఒప్పందం చేసుకున్నారు. ఇది బయటపడొద్దనే మాజీ సీఎం కేసీఆర్ బీజేపీతో మిలాఖత్ అయ్యాడని నిందలు వేస్తున్నారు. బాలాపూర్ సభలోనూ నాపై నిందలు వేయడం హాస్యాస్పదం. ఒక మహిళ అని చూడకుండా నేను బీజేపీ వాళ్లతో కలుస్తున్నానని నీచంగా మాట్లాడారు. ఇంద్రారెడ్డి కుటుంబ చరిత్ర తీసుకుంటే ఆనాడు ఎన్టీఆర్... ఆపై వైఎస్సార్... ఇప్పుడు కేసీఆర్... అధికారం వైపు కాకుండా నమ్ముకున్న నాయకుడివైపు నిలబడిన కుటుంబం మాది.

కాంగ్రెస్ మోసాన్ని ప్రజలు గమిస్తున్నరు

ఆరు నెలల వ్యవధిలోనే రెండు ఎన్నికలకు క్షేత్రస్థాయిలో ప్రచారం చేశాం. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ప్రజల దగ్గరకు వెళ్లినపుడు గుప్పెడు మందిలో వ్యతిరేకత ఉన్నా కనిపించలేదు. అప్పుడు పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు కండ్ల ముందున్నాయి. కానీ పార్లమెంటు ఎన్నికల ప్రచారం చేస్తున్నపుడు మాకంటే ముందు ప్రజలే స్పందిస్తున్నరు. రైతుబంధు రాలేదు, నీళ్లు లేవు, కరెంటు లేదు, మేం కాంగ్రెస్ చేతిలో మోసపోయాం అనే ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక వృద్ధురాలు వచ్చి 'అమ్మా... పింఛను రూ.4వేల నుర్రు. ఇప్పుడు ఆ రూ. 2 వేలు కూడా వస్తలేవు' అని ఏడ్చింది. ఒక రైతు వచ్చి 'రంజిత్‌రెడ్డి కేసీఆర్ సార్‌ను మోసం చేసిండు. మీరు గట్టిగ చూసుకోవాలి' అని చెప్పాడు. ప్రజలు కాంగ్రెస్ మోసాన్నే కాదు... రంజిత్‌రెడ్డిలాంటి నేతల మోసాన్ని కూడా గమనిస్తున్నరు. అందుకే బీఆర్ఎస్ సమావేశాలకు స్వచ్ఛందంగా తరలివస్తున్నరు.

బీజేపీ 'రేషన్' స్థాయికి దిగజారిపోయింది...

ఇది పేరుకే జాతీయ ఎన్నికలు. రాష్ట్రంలో మాత్రం కేసీఆర్, రేవంత్‌రెడ్డి పాలనలో వ్యత్యాసాలను ప్రతి ఓటరు నిశితంగా పరిశీలిస్తున్నరు. కేంద్రం నుంచి రాష్ట్రానికి ఏమైనా పెద్ద ప్రాజెక్టు వచ్చినా, సామాన్యుడికి పెద్ద మేలు జరిగినా చర్చ జరిగేది. బీజేపీ వాళ్లకు చెప్పుకునేందుకు ఏమీలేదు. అందుకే ఉచిత రేషన్ ఇస్తున్నామని ప్రచారం చేసుకునే స్థాయికి దిగజారిపోయారు. కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్‌రెడ్డి కేసీఆర్ ప్రభుత్వం హెచ్ఎండీఏ ఆధ్వర్యంలో చేసిన అభివృద్ధిని కూడా తాను చేసినట్టు చూపించుకునే దౌర్భాగ్య పరిస్థితి. బీజాపూర్-మన్నెగూడ జాతీయ రహదారి కూడా కేసీఆర్ అనేకసార్లు ఢిల్లీ వెళ్లి సాధించిన ప్రాజెక్టు.

రంజిత్‌రెడ్డికి నైతిక విలువలు ఉన్నాయా?

రంజిత్‌రెడ్డి ఎవరో తెలియని రోజుల్లో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆయన్ని చేవెళ్ల ఎంపీగా చేశారు. ఐదేండ్లు రంజిత్‌రెడ్డి ఎప్పుడు చూసినా కేసీఆర్, కేటీఆర్‌కు కుడి, ఎడమగానే తిరిగారు. కానీ రంజిత్‌రెడ్డి బీఆర్ఎస్, కేసీఆర్‌కు చేసిన ద్రోహం అంతా ఇంతా కాదు. ఒకవైపు ఎమ్మెల్సీ కవిత అరెస్టు అయినపుడు ఆ కుటుంబానికి అండగా నిలవాల్సిన సమయంలో.. ఇంకోవైపు రంజిత్‌రెడ్డి నవ్వుకుంటూ కాంగ్రెస్ కండువా కప్పుకోవడం సామాన్య ప్రజల్ని ఎంతో కలచివేసింది. కార్యకర్తలు ఒత్తిడి తెస్తే పోయినట్టు రంజిత్‌రెడ్డి ఒక ఇంటర్వ్యూలో చెప్పారు. కానీ నిజమైన కార్యకర్త పార్టీ కష్ట సమయంలోనూ వెన్నంటి ఉంటడు. అయినా పార్టీ మారితే కార్యకర్తల్ని సమన్వయం చేసుకోలేని వ్యక్తి నాయకుడు ఎలా అవుతాడు?

'పాలమూరు'ను అటకెక్కించిన పార్టీలు...

చేవెళ్లలో దాదాపు ఎనిమిది లక్షల ఎకరాలను సస్యశ్యామలం చేసే పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును కాంగ్రెస్, బీజేపీ కలిసి పక్కన పడేశాయి. మల్కాజిగిరి ఎంపీగా ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి తన సొంతగడ్డకు చెందిన పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వమని ఏనాడైనా పార్లమెంటులో అడిగారా? ఇప్పుడు సీఎంగా అధికారంలోకి వచ్చిన తర్వాత కేసీఆర్ ప్రభుత్వం కాల్వల నిర్మాణానికి పిలిచిన రూ.5వేల కోట్ల టెండర్లనూ రద్దు చేశారు. కొడంగల్‌కు మాత్రం లిఫ్టును తెచ్చుకుంటున్నారు. అలాంటప్పుడు చేవెళ్ల పార్లమెంటు ప్రజలు కాంగ్రెస్‌కు ఎందుకు ఓటేయాలి? 2014 ఎన్నికల ప్రచారంలో పాలమూరు ప్రాజెక్టును చేపడతానని చెప్పిన ప్రధాని మోదీ ఇప్పటివరకు కృష్ణాజలాల కేటాయింపుల్ని పూర్తి చేయకపోగా, కేటాయింపులు లేవని పాలమూరు ప్రాజెక్టుకు కేంద్ర నిధుల్ని కూడా ఇవ్వడంలేదు. మరి బీజేపీకి చేవెళ్ల ప్రజలు ఎందుకు ఓటేయాలి? కేసీఆర్ ఉంటే ఇప్పటివరకు కాల్వల నిర్మాణం దాదాపుగా పూర్తయ్యేదని రైతులే స్వయంగా మాకు చెబుతున్నారు.

చేవెళ్ల సెంటిమెంటుతో శుభం

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పార్లమెంటు ఎన్నికల ప్రచారాన్ని చేవెళ్ల నుంచి మొదలుపెట్టారు. అందుకే ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు శుభం కలగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నా. రాష్ట్రంలో ప్రజల నుంచి వస్తున్న స్పందన చూస్తే అత్యధిక స్థానాలను కచ్చితంగా కైవసం చేసుకుంటాం. చేవెళ్లలో మా అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ కావడం ఎంతో కలిసి వస్తుంది. 96 బీసీ కులాలను ఏకం చేసిన ఘనత ఆయనది. జడ్పీ చైర్మన్‌గా, ఎమ్మెల్సీగా చేవెళ్ల ప్రజలకు ఆయన సుపరిచితుడు. మా కార్యకర్తలు, ఏడు నియోజకవర్గాలకు చెందిన ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు కష్టపడి సమష్టిగా పని చేస్తున్నాం. అందుకే కచ్చితంగా చేవెళ్లలో భారీ మెజార్టీతో కాసాని గెలవబోతున్నారు.

కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి రేవంత్ సహకారం

వాళ్లిద్దరూ మంచి ఫ్రెండ్స్.. అందుకే ఇన్‌డైరెక్ట్ సపోర్ట్

- మా నాన్నపై రంజిత్‌రెడ్డిని నిలబెట్టడం మాకు పెద్ద గిఫ్ట్
- సునీతామహేందర్‌రెడ్డి అయితే టఫ్ ఫైట్ ఉండేది
- రేవంత్ పీసీసీ అయ్యేందుకు సపోర్టు చేసింది నాన్ననే
- కొండను పిండి చేస్తామనడం డ్రామానే..
- బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి కొడుకు విశ్వజిత్ సంచలన వ్యాఖ్యలు

హైదరాబాద్, మే 9 (నమస్తే తెలంగాణ): 'కాంగ్రెస్ బతకాలంటే రేవంత్‌రెడ్డి పీసీసీ చీఫ్ కావాలని సపోర్టు చేసింది మా నాన్నగారే. 'కొండను పిండి చేస్తాం.. చేవెళ్లలో గెలువనివ్వం అనడం డ్రామా'. రంజిత్‌రెడ్డికి టికెట్టు ఇవ్వడమే నాన్నకు, రేవంత్‌రెడ్డికి మధ్య ఉన్న ఫ్రెండ్‌షిప్‌కు నిదర్శనం. సునీతా మహేందర్‌రెడ్డి ఉంటె టఫ్‌ఫైట్ ఉంటుండె. రంజిత్‌రెడ్డి ఉండడం మనకు పెద్ద గిఫ్ట్. రేవంత్‌రెడ్డి మనకు ఇన్‌డైరెక్ట్‌గా సపోర్టు చేశాడని కూడా అనుకోవచ్చు.' ఇది ఎవరో ఆషామాషీ వ్యక్తి అన్న మాటలు కాదు. సాక్షాత్తు చేవెళ్ల బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి కుమారుడు కొండా విశ్వజిత్ వ్యాఖ్యలు. పీసీసీ అధ్యక్షుడు, సీఎం రేవంత్‌రెడ్డి బీజేపీకి పరోక్షంగా సహకరిస్తున్నారన్న కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతల ఆరోపణలు నిజమేనని కొండా విశ్వజిత్ మాటలతో తేటతెల్లమయ్యింది. బీజేపీని గెలిపించేందుకే రేవంత్‌రెడ్డి కొన్ని లోక్‌సభ నియోజకవర్గాల పరిధిలో డమ్మీ అభ్యర్థులను నిలబెట్టారనేది మరోసారి రుజువైంది. ఇటీవల ఒక టీవీ చానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో కొండా విశ్వజిత్ తన తండ్రికి, సీఎం రేవంత్‌రెడ్డికి మధ్య ఉన్న స్నేహాన్ని, తమకు రేవంత్‌రెడ్డి సహకరిస్తున్న తీరును సంపూర్ణంగా వివరించారు. సోషల్ మీడియాలో కొండా విశ్వజిత్ ఇంటర్వ్యూ వైరల్ అవుతున్నది. తన తండ్రి కాంగ్రెస్‌లో ఉన్నప్పుడు అధిష్ఠానంపై ఒత్తిడి తెచ్చి రేవంత్‌రెడ్డికి పీసీసీ అధ్యక్ష పదవి దక్కేందుకు సహకరించారని, ఆ కృతజ్ఞతతోనే స్థానిక నేత పట్నం సునీతామహేందర్‌రెడ్డిని కాకుండా రంజిత్‌రెడ్డికి చేవెళ్ల టికెట్టు ఇచ్చి పోటీ చేయిస్తున్నారని, ఇలా చేయడం తమకు ఎంతో కలిసి వచ్చే అంశమని విశ్వజిత్ స్పష్టంచేశారు. రేవంత్‌రెడ్డి ఇటీవల చేవెళ్ల పర్యటన సందర్భంగా బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని గెలిపించవన్న, కొండను పిండి చేస్తానంటూ చేసిన వ్యాఖ్యలను సీరియస్‌గా తీసుకోవాల్సిన అవసరం లేదని, 'కొండను పిండిచేస్తా' అన్న మాటలు డ్రామా అని విశ్వజిత్ అభివర్ణించారు.

ఇంకెందరు డమ్మీ అభ్యర్థులున్నారో..

చేవెళ్లలో కాంగ్రెస్ డమ్మీ అభ్యర్థిగా రంజిత్